
# ఎవరికి చెందాలీ బహుమతి ?



'ప్రభవ' మాస పత్రిక . . . జూలై, 1979

ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ఆ పత్రికవాళ్ళు దీపావళి కథల పోటీలు ప్రకటించారు.

మొదటి బహుమతి ఘనంగా రెండువేలు పెట్టారు. మామూలుగా అయితే, మనస్సులో ఎన్ని ఆలోచనలు ఉన్నా కాగితం మీద కలం పెట్టడం అనేసరికి– ఎక్కడలేని నిద్రా వస్తుంది. నిద్ర రాకపోతే చెప్పలేని బద్ధకం వస్తుంది. అవి లేనపుడు సరియైన ఆలోచనే రాదు. ఇట్లా వుంటుంది నా పని! కాని, ఎదురుగా రెండువేలు కనిపిస్తుంటే... చూస్తూ చూస్తూ ఊరుకోలేక పోతున్నాను.

'కొంచెం ఆలోచించి మంచి ఇతివృత్తం ఎన్నుకుని కథ వ్రాస్తే బహుమతి రావచ్చు. రాసినంత మాత్రంలో వచ్చి తీరుతుందని కాదు కాని, రాకూడదని లేదుగా?! మనం కొన్న ప్రతి లాటరీ టిక్కెట్టుకీ బహుమతి రాదు... అదృష్టముంటే తగులుతుంది.

కాని, అదృష్టం తగలడానికైనా ఒక దారి ఏర్పరచాలి కదా! లాటరీలు అయితే కేవలం అదృష్టమే! కాని, కథ వ్రాయటంలో కృషిది ప్రాధాన్యం! చిత్తశుద్ధితో కృషి చేస్తే అది ఫలించవచ్చు.'

– ఈ విధంగా ఆలోచించుకుంటూ ఎలాగైనా పోటీకి కథ పంపించాలని నిశ్చయించుకున్నాను. కాని, ఎంత ఆలోచించినా సరియైన ఇతివృత్తమే మనసులోకి రాలేదు.

నా శక్తిమీద నాకే అనుమానం వేయసాగింది. పోటీ గడువు దగ్గర పడుతుంటే నాకు ఆందోళన ఎక్కువ కాసాగింది. మర్నాడు పోస్టు చేస్తేనే నా కథ గడువు లోపల చేరుతుంది. అయినా నాకు ఆలోచన రాకపోతుండేసరికి– ముందున్న సిద్ధాన్నాన్ని ఎవరో తన్నుకుపోతున్నట్లు అనిపించసాగింది. అక్కడికీ... కథ పంపితే నాకే బహుమతి వచ్చేటట్లు ఏమిటీ వెర్రి ఆలోచన?! – నన్ను చూసి నాకే నవ్వు వచ్చింది.

సాయంత్రం ఆఫీసు వదిలిపెట్టాక ఇంటికి బయలుదేరాను.

రోడ్డుమీద నడుస్తున్నానే కాని, నా ఆలోచనంతా పోటీకి కథ రాయడం కోసం కావలసిన ఇతివృత్తం కోసమే! కాలం గడుస్తున్నకొద్దీ నాలో ఆందోళన ఎక్కువైపోతోంది. నాకు రాబోయే పెన్నిధిని ఎవరో దోచుకుపోతున్నట్లు బాధపడసాగాను.

ఆలోచనలతోనే నెమ్మదిగా నడుస్తూ నయాపూల్ వద్దకు వచ్చాను.

అక్కడ పేవ్‌మెంట్ ప్రక్కనే ఒక యువకుడు దిగులుగా కూర్చుని ఉన్నాడు. అతని ప్రక్కనే ఒక అందమైన వీణ ఉంది. అతను మాత్రం చెదిరిపోయిన జుట్టూ, మాసిపోయిన

గడ్డంతో బక్కచిక్కి ఉన్నాడు. కళ్ళు పీక్కుపోయి ఉన్నాయి. కాని, వాటిలో కాంతి తగ్గలేదు. తెల్లని ఛాయ, లేత అరిచేతులు చూస్తుంటే 'బ్రతికి చెడ్డవాడు' అనిపిస్తోంది. వయసు చూస్తే ముప్పై కూడా మించి ఉన్నట్లు అనిపించలేదు.

అయినా ఏదో దిగులు అతన్ని కృంగదీసినట్లు తోస్తోంది. మాసిపోయిన లాల్చీ, పైజామాలతో ఉన్నా, అతనిలో మాత్రం ఏదో వింత ఆకర్షణ ఉంది. విచిత్రమేమిటంటే, అతని ప్రక్కనున్న వీణ మాత్రం ఎంతో అందంగా, అప్పుడే కొన్నంత కొత్తగా ఉంది.

నాకు వీణంటే ఎంతో ఇష్టం! ఎన్నాళ్లనుంచో కొనాలని అనుకుంటున్నాను. కాని, అంత ఇష్టంలేక ఊరుకున్నాను.

ఇది చూడబోతే పేవ్‌మెంట్ మీద పెట్టివుంది. బహుశా సెకండ్‌హ్యాండ్‌గా అమ్మడానికి అయివుంటుంది. వెళ్లి దానిని అమ్ముతాడేమో అడగాలని అనుకున్నాను.

అతను అమ్ముతానంటే మాత్రం నా దగ్గర డబ్బేదీ? ఏమో... పంపబోయే కథకు బహుమతి రాకూడదూ? 'ఆలు లేదూ... చూలు లేదూ.. కొడుకు పేరు సోమలింగం!' అన్నట్లుంది నా ఆలోచన.

నా బోళాతనానికి నాకే నవ్వు వచ్చింది. 'కొనపోతే మాత్రమేం? అడిగితే తప్పేముంది?' అనుకుని ఆ వీణ దగ్గర నుంచున్నాను.

అతను ఒక్కక్షణం నా ముఖంలోకి పరకాయించి చూశాడు.

"ఏమిటి సార్? వీణని కొంటారా?" అని అడిగాడు.

"ధర ఎంత?" అని అడిగాను.

"నూట యాభై!" అన్నాడు అతను.

"నూటయాభయ్యా?" అన్నాను ఆశ్చర్యంగా! నా ఉద్దేశం ఆ ధర ఎక్కువని కాదు. అంత మంచి వీణ- అది నిజంగా తక్కువ ధర! అందుకే 'పొరబాటుగా వినలేదు కదా!' అని మళ్లీ అడిగాను.

నేను బేరం ఆడుతున్నానని అనుకున్నాడు అతను. "అయ్యా! గతిలేక చాలా తక్కువ ధరకి అమ్ముకుంటున్నాను... బేరం ఆడకండి!" అన్నాడు దీనంగా.

అతని మాటలకి నా మనస్సు చివుక్కుమంది. ఏమీ మాట్లాడకుండా వీణని పరీక్షించడం మొదలుపెట్టాను.

"అయ్యా... నేను గౌరవం గల కుటుంబంలో పుట్టినవాడినే! సరిగ్గా చదువుకోలేదు కాబట్టి నాకు ఉద్యోగం దొరకలేదు. వీణలో అయితే గొప్ప పాండిత్యం సంపాదించాను

కాని, అది నాకు కూడు పెట్టలేదు. నన్ను అల్లారుముద్దుగా పెంచిన అమ్మా, నాన్నా పోవడంతో- ఇలా వీధిన పడ్డాను. ఈ వీణే నా జీవితం, నా సర్వస్వం! చివరికి దీనిని కూడా అమ్ముకుంటున్నాను" అంటూ ఆవేశంగా పలికాడు ఆ వ్యక్తి. చివరిమాటలు అంటుంటే అతని కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

అతని దయనీయమైన గాథ వింటుంటే... నాకు ఎంతో బాధవేసింది. నా హృదయాన్ని ఎవరో పిండివేస్తున్నట్లనిపించింది.

"సారీ! నేను బేరమాడే ఉద్దేశంతో అనలేదు. మీ కథ వింటుంటే నాకు చాలా బాధగా వుంది. కాని, నేను ఏ విధంగా సహాయం చేయగలను?" అన్నాను.

"మీకు నచ్చితే ఈ వీణని కొనండి... నాకు అదే చాలు! మిమ్మల్ని చూస్తే సంస్కారవంతులుగా అనిపిస్తున్నారు. మీవంటి వారి దగ్గర నా వీణ క్షేమంగా ఉంటుందని భావిస్తున్నాను!" అన్నాడు అతను.

"నాపట్ల మీకు సదభిప్రాయం కలిగినందుకు సంతోషం! కాని, మీ జీవిత సర్వస్వమైన వీణని విడిచి ఎట్లా ఉంటారు?" అన్నాను.

అతను నిర్లిప్తంగా చిరునవ్వు నవ్వాడు.

"నా జీవితం నాకు దూరం అయ్యాక నా ప్రాణం ఉంటుందా? నేను ఈ లోకాన్నుంచే సెలవు తీసుకునే రోజు దగ్గరకు వచ్చింది కనుకనే- నా జీవిత సర్వస్వాన్ని వదులుకోవడానికి సిద్ధపడ్డాను. దీనిని ఒక అయ్య చేతిలో పెట్టి ఒక రసహృదయునికి అప్పచెప్పి నేను తృప్తిగా వెళ్లిపోగలను. వెళ్లేదాకా కాస్తోకూస్తో భుక్తి గడవాలి కనుక ఈ డబ్బుని అడుగుతున్నాను" అన్నాడు అతను.

అతని మాటలు వింటుంటే నా గుండె బరువెక్కిపోయింది. నాకు బహుమతి వస్తే తప్పక ఆ వీణని కొనాలని నిశ్చయించుకున్నాను. అప్పటి నా అసహాయతకి నామీద నాకే జాలివేసింది. నా పేరాశకి నవ్వూ వచ్చింది.

"మీ వీణ నాకు నచ్చింది. కాని, ఇపుడు డబ్బు తీసుకురాలేదు. రేపో, ఎల్లుండో వచ్చి కొంటాను. ఈలోగా బేరం వస్తే మాత్రం వదులుకోకండి!" అన్నాను. నేను ఎలాగూ కొనలేనని తెలుసు. అందుకే అతని ముఖం వంక సూటిగా చూడలేకపోయాను.

"సరే మీ ఇష్టం... మీవంటి సహృదయులు కొంటేనే నాకు తృప్తి!" అన్నాడు అతను.

నేను "మళ్లీ వస్తా..." అంటూ సెలవు తీసుకుని, ముందుకి సాగిపోయాను.

నడుస్తున్నా నన్నుమాటే కానీ, నా మనస్సు మనస్సులో లేదు. అతని దీనగాథే నా మనస్సులో మెదులుతోంది. ఉన్నట్లుండి నాకు అనిపించింది- అతని జీవితాన్నే ఒక కథగా మలచి, వ్రాసి ఎందుకు పోటీకి పంపకూడదు? ఆ కథకి బహుమతి రానీ, రాకపోనీ! ఏ పత్రికలోనైనా ప్రచురణ కానీ, కాకపోనీ! ఒక మంచికథ వ్రాశాననే తృప్తి నాకు ఉంటుంది. నాకు మంచి ఇతివృత్తం దొరికినందుకు ఎంతో సంతోషం వేసింది.

చకచకా ఇంటికి వెళ్లి భోజనం చేసి, కథ వ్రాయడం మొదలుపెట్టాను.

పన్నెండు గంటలకి నా రచన పూర్తి అయింది. దానికి 'మాణిక్య వీణ' అని పేరు పెట్టాను. మంచికథ వ్రాశాననే తృప్తి ఉన్నా అతనిని గురించిన వ్యథతో, కలత నిద్రతో గడిపాను. మర్నాడు ప్రొద్దున్నే నా కథని పోస్టు చేశాను.

మర్నాడు కూడా నాకు ఆ వీణ అమ్మదలచుకున్న వ్యక్తిని గురించే ఆలోచనలు!

నయాపూల్ మీదకి రాగానే దూరం నుంచి అతనూ, ప్రక్కనే వీణ కనిపించాయి.

నా గుండె ఝల్లుమంది. ఆ వీణని కొనడానికి ఎవరూ రాలేదు, లేకపోతే నా కోసమే ఎదురుచూస్తున్నాడో!

అతని కంటపడడానికి ధైర్యం చాలలేదు. బ్యాగ్ ముఖానికి అడ్డంపెట్టుకుని, అవతలి పేవ్‌మెంట్ మీదనుంచి చకచకా వెళ్లిపోయాను. వెనక్కి తిరిగి అతని వంక చూడడానికి కూడా ధైర్యం చాలలేదు.

ఆ తర్వాత రెండురోజులు కూడా అతన్ని వీణ పెట్టుకుని ఉండగా చూశాను. అతనికి కనబడకుండానే తప్పించుకుని వెళ్లిపోయాను.

ఆ మరుసటిరోజు అతను కనిపించలేదు. బహుశా ఆ వీణని ఎవరో కొనేసి ఉంటారని అనుకున్నాను. దానిని కొనలేకపోయినందుకు చాలారోజులు బాధపడ్డాను. మరో రెండు మూడు రోజుల్లోనే అతన్ని గురించిన జ్ఞాపకాలు మాసిపోయాయి.

ఆరు వారాలు గడిచాయి!

●

"పోస్ట్..!"

– అంటూ పోస్ట్‌మాన్ వచ్చాడు ఆరోజు.

నాకు ఉత్తరాలు అంతగా రావు. 'ఎవరి దగ్గర్నుంచి వచ్చి ఉంటుందబ్బా?' అనుకుంటూ ఉత్తరం తీసుకున్నాను.

నేను కథ పంపించిన పత్రికవారి దగ్గర నుంచి కవరు ఉత్తరం వచ్చింది.

అదిరే గుండెతో కవర్ని విప్పాను.

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అందులో నా కథానిక 'మాణిక్య వీణ'కి ప్రథమ బహుమతి రెండువేల రూపాయలు వచ్చినట్లు తెలుపుతూ అభినందనలు తెలియజేస్తూ ఉంది. అప్పటికి కానీ, నేను నా కథని వాటికి పంపిన విషయం జ్ఞాపకానికి రాలేదు. అసలు ఆ విషయమే ఎప్పుడో మరిచిపోయాను.

ఎందుకంటే... బహుమతి రావాలనే కోరిక ఉన్నా, వస్తుందనే నమ్మకం లేదు. ఆరోజు నాకు ఏనుగెక్కినంత ఆనందంగా ఉంది. మా సెక్షన్లో అందరికీ పార్టీ ఇప్పించాను. నా బహుమతి వార్త ఆఫీసంతటా దావాగ్నిలా వ్యాపించింది.

పత్రిక నుంచి వచ్చిన ఆ ఉత్తరాన్ని పదేపదే చదువుకున్నాను. ఉన్నట్లుండి నాకు ఆ వ్యక్తి జ్ఞాపకానికి వచ్చాడు. నాకు ఈ బహుమతి రావడానికి మూలకారణం అతను. బహుమతితో పాటు నాకు ఖ్యాతి కూడా లభిస్తుంది. ఇందుకు నేను ఆ వ్యక్తికి ఎంతగానో ఋణపడి ఉండాలి. ఆ వ్యక్తి ఎక్కడున్నాడో ఏమో, ఆ వీణని అమ్మేశాడో, లేదో?! అతను మళ్లీ కనిపిస్తే బాగుండును. కనిపిస్తే అతని దగ్గర వీణ ఉంటే తప్పక కొనాలి. ఇంకొంచెం ఎక్కువ ఇచ్చినా ఫర్వాలేదు.

సాయంత్రం ఆఫీసు వదలగానే- ఒకవేళ అనుకోకుండా ఆ వ్యక్తి కనిపిస్తాడేమోనని తిరిగి నయాపూల్ వైపు వెళ్లాను. ఒకవేళ అతను కనిపిస్తే... అతని దగ్గర వీణ ఇంకా ఉంటే... నాకు బహుమతి వచ్చిన విషయం చెప్పి, డబ్బు రాగానే తప్పక ఆ వీణని కొంటానని చెప్పాలనుకున్నాను.

'కేవలం ఆ వీణ కొన్నంత మాత్రంతో అతని ఋణం తీరుతుందా?' అని మనస్సుని ఎవరో అడిగినట్లనిపించింది.

'నిజమే! అతనికి నా బహుమతి మొత్తంలో ఎంత ఇచ్చినా ఋణం తీరదు. సగానికి సగం- అంటే వెయ్యి రూపాయలు ఇచ్చినా తప్పు లేదు. కాని, అంత ఇచ్చుకోలేను. కనీసం ఐదువందలు ఇద్దాం. ఐదువందలు ఇస్తే సరిపోతుందా? అతను చాలా సంస్కారవంతుడు. ప్రజ్ఞ ఉన్నవాడు. మా ఆఫీసులోనో, మరోచోట ఏదైనా ఉద్యోగం ఇప్పించాలి.' - ఇలా పరిపరి విధాలుగా ఆలోచిస్తూ నయాపూల్ చేరుకున్నాను.

కొంచెందూరం వెళ్లగానే- ఆ వీణ దూరంగా లీలగా కనిపించింది.

దానిని చూడగానే గుండె ఝల్లుమంది. అయితే ఇన్నాళ్లూ అది అమ్ముడుపోలేదన్న మాట! పాపం... అమ్మకాని కోసం, చోట్లు మార్చి ఉంటాడిన్నాళ్లూ.

పోనీలే... చివరికి ఇక్కడికే వచ్చాడు. ఇంతకీ ఆ వీణని కొనే యోగం నాకుంది.

సంతోషంగా, వడివడిగా అడుగులు వేస్తూ అతన్ని సమీపించాను.

అతన్ని చూసి నిర్ఘాంతపోయాను. మనిషి పూర్తిగా అస్థిపంజరం అయిపోయాడు. ఎముకల గూటికి బట్టలు కట్టినట్లుగా ఉన్నాడు. ఆ వీణ అతని ప్రక్కన లేకపోతే అసలు అతన్ని గుర్తుపట్టే వాడినే కాదు.

నన్ను చూడగానే అతని కళ్ళల్లో కాంతి మెరిసింది. నన్ను చూసి-

"వచ్చారా..?" అన్నాడు నీరసంగా.

అయితే... నన్ను గుర్తుపట్టాడన్నమాట!

"ఏమిటి? ఇలా చిక్కిపోయారేమిటి?" అన్నాను ఆవేదనగా.

"మీరు కలిసిన మర్నాటి నుంచే నాకు వళ్ళు తెలీని జ్వరం! బ్రతుకుతా ననుకోలేదు. బ్రతకాలనీ లేదు. నాకున్న దిగులల్లా ఒక్కటే... ఈ వీణని సరియైన వ్యక్తికి అప్పచెప్పకుండా పోతానేమోనని! అందుకేనేమో నా ప్రాణం పోకుండా నిలిచింది. మీరు వచ్చారు... నాకు చాలా సంతోషంగా ఉంది!" అన్నాడు అతను ఆయాసపడుతూ.

"మీకు ఒక మంచివార్త చెప్పాలని వచ్చాను. నాకు కథల పోటీలో రెండువేల రూపాయలు బహుమానం వచ్చింది. వారం పదిరోజుల్లో డబ్బే వచ్చేస్తుంది. అది రాగానే తప్పక వీణని కొంటాను. అంతేకాదు, మీకు నా కృతజ్ఞతా సూచకంగా అందులో కొంత భాగం ఇస్తాను" అన్నాను.

"నాకు... నాకెందుకు? నాకు కృతజ్ఞత ఏమిటి?" అన్నాడు అతను ఆశ్చర్యంగా.

"మీ జీవితాన్ని ఊహించుకుని మీకూ, మీ వీణకూ గల అనుబంధాన్ని ఆధారం చేసుకుని కథ వ్రాశాను. దానికే బహుమతి వచ్చింది. అందువల్ల ఈ డబ్బులో మీకూ భాగం ఉంది!" అన్నాను. ఆ మాటలు అంటుంటే నాకెంతో సంతోషం వేసింది.

అతను కొన్నిక్షణాలు ఏమీ మాట్లాడలేదు. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. బరువెక్కిన గొంతుతో- "మీరు రసజ్ఞులని, సరళ హృదయులని మిమ్మల్ని కలిసిన మొదటిరోజునే అనుకున్నాను. ఇప్పుడు నా అభిప్రాయం దృఢపడింది. ఇంక నాకు ఏ దిగులూ లేదు. నా వీణని మీ చేతుల్లో పెట్టి, ఈ లోకంనుంచి సెలవు పుచ్చుకుంటాను..." అంటూ వీణని ఎత్తి నా చేతుల్లో పెట్టబోయాడు. అది ఎత్తడానికే అతనికి ఓపిక లేదు.

"మీ దగ్గరే ఉంచండి... నాకు డబ్బు వచ్చాక తీసుకుంటాను" అంటూ అతన్ని వారించబోయాను.

"ఇప్పుడు... ఈ క్షణంలోనే పోయేవాణ్ణి- నాకు డబ్బెందుకండీ? తీసుకోండి... ఈ వీణ మీదే!" అంటూ దగ్గుతెరలో బాధపడ్డాడతను.

"మీకేమీ ఫర్వాలేదు. ఇప్పుడే మిమ్మల్ని ప్రక్కనే ఉన్న ఉస్మానియా ఆస్పత్రిలో చేరుస్తాను. మీ సంరక్షణ నేను చూసుకుంటాను..." అన్నాను.

అతను నీరసంగా నవ్వాడు.

"మీ అభిమానానికి కృతజ్ఞతలు! మరో జన్మంటూ ఉంటే మీ ఋణం తీర్చుకుంటాను. ఈ దీపం ఆరిపోతోంది సార్... ముందు ఈ వీణని తీసుకోండి! అది చూసి తృప్తిగా కళ్ళుమూస్తాను..." అన్నాడు ఆయాసపడుతూ.

అప్రయత్నంగా ఆ వీణని తీసుకున్నాను.

అతని కళ్ళల్లో వింతకాంతి గోచరించింది. ఆనందంతో కన్నీరు కారసాగింది.

"మీ పేరేమిటి? ఎక్కడుంటారు..?"

అతను ఏదో చెప్పబోయాడు. కాని, దగ్గుతెర వచ్చి మెలికలు తిరిగిపోతూ విపరీతంగా ఆయాసపడసాగాడు.

నేను కంగారుగా రిక్షాని పిలిచి అతన్ని అస్పత్రికి చేర్చే ప్రయత్నం చేశాను. కానీ ఆ అవసరం లేకుండానే- వీణని నా చేతిలో ఉంచుతూనే శాశ్వతంగా సెలవు తీసుకున్నాడు.

నేను కొయ్యబారిపోయాను. పేరు కూడా తెలియని ఆ సంస్కార హృదయానికి మనస్సులోనే జోహార్లర్పించాను.

నేను ఇవ్వాలనుకున్న బహుమతి విభాగం ఇప్పుడు ఎవరికి ఇవ్వాలి?

నేను ఆ కళాహృదయానికి ఇవ్వగల బహుమతి ఒక్కటే...

- అతని వీణని స్వంతబిడ్డ కంటే ఎక్కువగా చూడడం!

అందులోనే అతన్ని చూసుకోవడం..!!

*'ప్రభవ' మాస పత్రిక . . . జూలై, 1979*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...